సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



బాధితుడికి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని బాలాజీనగర్‌కు చెందిన వహీద్‌కు బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సీఎంఆర్ఎఫ్‌ను శనివారం అందజేశారు. వహీద్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా.. సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షలు మంజూరైంది. ఈ మేరకు బాధితుడి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, అన్నూ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు ఫ్రీజర్లు



మేడ్చల్: సామాన్యులు మృతి చెందితే వారి అంత్యక్రియల వరకు భౌతికఖాయాలను ఉంచేందుకు డీప్ ఫ్రీజర్ బాక్సులను ఎమ్మెల్యే మల్లారెడ్డి తన సేవా సంస్థ ద్వారా ఫ్రీజర్లను పలు గ్రామాలకు అందజేశారు. ఉమ్మడి మేడ్చల్‌లోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి, మేడ్చల్ మున్సిపాలిటీ మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీ డబిల్‌పూర్ గ్రామాలకు ఆయన ఫ్రీజర్ బాక్సులను అందజేశారు. దయానంద్‌యాదవ్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఫ్రీజర్‌లను గ్రామాలకు చేర్చారు.

చిన్నారుల బోనాల ఉత్సవాలు



కీసర: రాంపల్లిలోని సెరినిటీ స్కూల్‌లో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజులు, అమ్మవార్ల వేషధారణలో వచ్చి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ముఖ్యకార్యదర్శి నోముల వసంత మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించడం మన బాధ్యత అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా !



రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

మేడ్చల్: మేడ్చల్ రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తాగునీటి పైపులైన్ లీకవుతుండటంతో నీరు పూర్తిగా వృథా అవుతున్నాయి. ఆసుపత్రి ఎదుట ఉన్న పైపులైన్ మ్యాన్‌హోల్ వద్ద నీరు బయటికొచ్చి రోడ్డుపై చేరడంతో రోడ్డంతా జలమయమైంది. రైల్వేస్టేషన్ రోడ్డులో తాగునీరు పైకి చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాటమయ్య బోనాలు



కీసర: రాంపల్లిలోని గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య బోనాలు వైభవంగా జరిగాయి. శనివారం మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి బోనాలు సమర్పించారు. గౌడ సంక్షేమ సంఘం పెద్దలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఇన్‌వెస్టిట్యూట్' వేడుకలు



ప్రమాణస్వీకారం చేసిన విద్యార్థి మండలి సభ్యులు

పోచారం: యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'ఇన్‌వెస్టిట్యూట్' వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వార్షిక విద్యార్థి మండలికి ఎన్నికైన విద్యార్థులతో పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. నాయకత్వం, ప్రజాస్వామ్య విలువలు, సమగ్ర విద్యా విధానాన్ని ఆవిష్కరించేందుకు ప్రేరణగా వేడుకలను నిర్వహించారు. హెడ్‌బాయ్‌గా సాయిసత్య, హెడ్ గర్ల్స్‌గా యశిక ఎంపికయ్యారు. హౌస్ కెప్టెన్లుగా కుల్సుమ్, లిపికా, తేజస్రివల్లి, చరణ్‌తేజ నియమితులయ్యారు. స్కూల్ సీఈఓ సబ్రహ్మణ్యం రంగినేని, ప్రిన్సిపాల్ దివ్యశర్మ పాల్గొన్నారు.

మహిళలకు బీమా..
కుటుంబానికి ధీమా !

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి | జిల్లాలో 1.10 లక్షల మంది మహిళా సంఘం సభ్యులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: స్వయం సహకార సంఘాల మహిళల పరిరక్షణ, వారికి భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. వారు వ్యాపారపరంగా రాణించి ఆర్థికాభివృద్ధి సాధించేలా.. పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్త్రీనిధి రుణాలను అందిస్తూ.. ప్రోత్సాహం అందిస్తోంది. మహిళా సంఘంలో సభ్యురాలిగా పేరు నమోదు చేసుకున్న వారికి బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది.

పేద కుటుంబాలపై భారం పడకుండా..

18 ఏళ్ల పైబడిన పేదలు సభ్యులుగా చేరవచ్చు. రుణం పొందిన సంఘ సభ్యురాలు మరణిస్తే.. ఆమెకు సంబంధించిన బాకీ కుటుంబసభ్యులు లేదా మిగతా సభ్యులపై భారం పడకుండా ప్రభుత్వం బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో సాధారణ మరణం పొందితే బ్యాంకు రుణం మాఫీ కావడం, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.పది లక్షలు కుటుంబసభ్యులకు అందేలా అధికారులు బీమా పథకాలను అమలుచేస్తున్నారు.

స్త్రీనిధి సురక్ష..

మహిళా సంఘం సభ్యురాలు స్త్రీనిధిలో రుణం తీసుకుని కొంత చెల్లించి సాధారణ మరణం పొందితే తీసుకున్న రుణంలో మిగతా మొత్తం మాఫీ అవుతాయి. మృతి చెందిన సభ్యురాలు కట్టిన డబ్బులు తిరిగి వారి సంఘం ఖాతాలో జమచేస్తారు.

రుణ మాఫీ..

బ్యాంకు లింకేజీ/ స్త్రీనిధి లేదా రెండింటిలో ఓ సంఘ సభ్యురాలు రుణం తీసుకుంది. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణంలో కొంత చెల్లించాక మరణించింది. మిగిలిన బాకీలో గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు మాఫీ అవుతుంది.





ప్రమాద బీమా..

మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరితే చాలు రుణం తీసుకోకున్నా.. ప్రమాద బీమా వర్తిస్తుంది. సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.10 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రమాదంలో గాయపడి అంగవైకల్యం ఏర్పడితే బీమా పొందవచ్చు. సదరం ధ్రువీకరణ పత్రంలో 80 శాతానికి పైగా దివ్యాంగత్వం ఉండాలి. అప్పుడు (50శాతం) రూ. 5 లక్షల పరిహారం పొందవచ్చు. రుణం తీసుకున్న సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రమాద బీమాతో పాటు మరో బీమా రెండూ వర్తిస్తాయి.

కుటుంబానికి భరోసా..

ప్రభుత్వం కల్పించిన బీమా పథకాలతో మహిళా సంఘం కుటుంబాలకు భరోసా ఉంటుందని డీఆర్డీఏ అధికార వర్గాలు చెబుతున్నాయి. సాధారణ, ప్రమాదవశాత్తు మరణిస్తే సంబంధిత వీవోఏల ద్వారా సీసీకి పంపాల్సి ఉంటుంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో పలువురికి 2 రకాల బీమా లబ్ధి చేకూరినట్లు సమాచారం.

10,575 మహిళా సంఘాలు..
1.10 మంది సభ్యులు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల ఉండగా.. 1,10,007 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సెర్ప్‌లో 3,404 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా.. 37,557 మంది సభ్యులు ఉన్నారు. మెప్మాలో 7,245 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా.. 72,450 మంది సభ్యులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మేడ్చల్‌లో ర్యాలీ నిర్వహించిన అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వరదారెడ్డి, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మహేష్, దేవ, సత్యనారాయణ, రంజిత్, నరేందర్, సంజీవరావు, రవిముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, స్వామియాదవ్, రాజు, బాలమల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే పర్యటన



హరిజన బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: డివిజన్ హరిజన బస్తీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో కలిసి పర్యటించారు. హరిజనబస్తీలో బస్తీ గ్రామకంఠంలోని ఇళ్లకు పట్టాలు లేకపోవడంతో నీటిబిల్లులు అధికంగా వస్తున్నాయని, దీంతో పేదలపై భారం పడుతోందన్నారు. నీటి బిల్లులు మాఫీ చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వారు కొత్త మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారన్నారు. దీనికయ్యే ఖర్చులో తన వంతు సాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఉపాధి కల్పనకు కృషి..

మహిళ భవన్‌లో ఉపాధి కల్పనకు కృషి చేసిన మహిళ భవనం అందుబాటులో ఉండేలా కృషి చేయాలని కోరారు. వీధి దీపాలు వేయించాలని, లోతట్టు ప్రదేశాలలో డ్రైనేజీ, సీసీరోడ్డు సమస్యలను పరిష్కరించాలని, పారిశుద్ధ్య నిర్వహణ చేయించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, లైన్‌మెన్ రమేష్, ఏఈ వరుణ్‌దేవ్, కార్పొరేటర్లు శాంతి, సబిత , లడ్డానరేందర్‌రెడ్డి, జేఏసీ సురేందర్‌రెడ్డి, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, లక్ష్మణ్‌యాదవ్, శోభన్, శరణగిరి, అరుణ్, యాదగిరిగౌడ్, వెంకటేష్‌యాదవ్, సందీప్, అరవింద్, మహేష్, పవన్, శ్రీధర్‌గౌడ్, ఆరీఫ్, రహమత్ తదితరులు పాల్గొన్నారు.




డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లో రూ.5 లక్షలతో చేపట్టే డ్రైనేజీ పైపులైన్ పనులను శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. లడ్డా నరేందర్‌రెడ్డి, జేఏసీ సురేందర్‌రెడ్డి, డోలి రమేష్, పరమేష్, లక్ష్మణ్‌యాదవ్, శోభన్, వెంకటేష్‌యాదవ్, పవన్, మహేష్, ప్రశాంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, సతీష్, ఆరీఫ్, రహమత్, సురేష్, వెంకటేష్, ప్రశాంత్, జావేద్, రాజేందర్, కాలనీవాసులు రాజుయాదవ్, వెంకట్, మల్లారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రవి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ సత్యనారాయణస్వామి దేవాలయంలేన్‌లో రూ. 5 లక్షలతో చేపట్టే కొత్త తాగునీటి పైపులైన్ పనులను శనివారం కార్పొరేటర్ బండారి శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని తన దృష్టికి వచ్చిందన్నారు. దశలవారీగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. జలమండలి మేనేజర్ రవీందర్‌గౌడ్, కిషన్, బీజేపీ నేతలు వేముల తిరుపతయ్య, శ్రీను, భాస్కర్, శైలేందర్ తదితరులున్నారు.



బీసీ కోటా పెంచడం అభినందనీయం

ఘట్‌కేసర్: వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల కోటా పెంచాలని మంత్రివర్గం నిర్ణయం అభినందనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సంజీవముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. జనాభా ధమాషా ప్రకారం బీసీలకు 42 శాతం సీట్లను పెంచడంతో రాజకీయంగా అభివృద్ధి చెందుతామని, ఎన్నికల్లో నిలబడి గెలిచి ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. రిజర్వేషన్లు పెంపుతో బీసీలకు న్యాయం లభిస్తుందన్నారు. ఆర్డినెన్స్ ద్వారా పెంచిన రిజర్వేషన్లను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రజక సంఘం నూతన కార్యవర్గం

జవహర్‌నగర్: మేడ్చల్, మల్కాజిగిరిజిల్లా రజక సంఘం సమావేశం కార్పొరేషన్ పరిధిలో నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మైలారం జనార్దన్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా అశోక్‌కుమార్, కాప్రా మండల అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, మండల కార్యదర్శిగా ఓరుగంటి చంద్రమౌళిలను నియమించారు.

అయ్యప్ప ఆలయంలో చోరీ

మేడ్చల్‌రూరల్: అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న అయ్యప్ప ఆలయంలో శుక్రవారం రాత్రి దుండగులు ఆలయంలోకి చొరబడి ముక్కుండి, చెమ్మలు, హుండీలోని డబ్బులతో పరారయ్యారు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మేడిపల్లి: కుటుంబకలహాలతో మనస్థాపం చెంది ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ అశోక్‌నగర్‌కు చెందిన నాగవెల్లి రాంచందర్(55)కు భార్య శ్రీవాణి, ముగ్గురు పిల్లలు గతేడాది నుంచి భార్యాపిల్లలతో దూరంగా ఉంటున్నాడు. దీంతో అతడు మద్యానికి బానిసై తన తల్లితో ఉంటున్నాడు. కుటుంబానికి దూరం కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై శనివారం ఉదయం 8.30 గంటకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

సీసీరోడ్డు పనుల పరిశీలన

మల్లాపూర్: నాచారం న్యూ రాఘవేంద్రనగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను శనివారం నాచారం కార్పొరేటర్ శాంతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. రాఘవేంద్రనగర్ నుంచి ఇందిరానగర్ వెళ్లే దారిలో డ్రైనేజీ పనులను పరిష్కరించి రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. డ్రైనేజీ, సీసీరోడ్డు పనులను చేపట్టడంతో కాలనీవాసులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

జీవిత సమరాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి



పట్టాలు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ పట్టాతో బయటకు వెళ్తున్న విద్యార్థులు జీవిత సమరాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్, కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ, టెక్నికల్ క్యాంపస్‌లలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్లు భూపాల్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, జంగారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కీసర: కీసరలో నిలిచిపోయిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వివరాలోకి వెళ్తే.. గత ప్రభుత్వంలో సుమారు రూ.కోటితో కీసర నుంచి బోగారం రహదారిలో గత కాలనీ పార్కు స్థలంలో సుమారు 500 గజాల్లో జీ-ప్లస్ వన్ విధానంలో గ్రంథాలయ నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ దాదాపు 80 నుంచి 90 శాతం వరకు పూర్తి చేశారు. నిధుల కొరత కారణంగా పనులు పూర్తి కాలేదు. గ్రంథాలయ భవనం పూర్తి స్థాయిలో పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలంటే మరో రూ.50 లక్షల మేర నిధులు అవసరం. ప్రస్తుత భవనంలో విద్యుత్ పేయింటింగ్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు నిధుల అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. నిధులు మంజూరైతే పెండింగ్ పనులను పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కీసర గ్రంథాలయ పాఠకులు కోరుతున్నారు.



గ్రంథాలయ భవనం

పల్లె సృజన కేంద్రం సందర్శన



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం నగరంలోని పల్లె సృజన కేంద్రాన్ని సందర్శించారు. కార్యాలయ వాలంటీర్‌తో కలిసి వ్యవసాయంలో ఆవిష్కరణలు, పోర్టబుల్ పంపుసెట్లు, సౌరశక్తి స్ప్రేయర్లు, ఆయుర్వేదంతో పాటు గ్రామీణ ఆరోగ్యం కోసం ఉపయోగపడే యంత్రాల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ పాల్గొన్నారు.

ముళ్ల పొదలు కావు.. కుంటే !

మేడ్చల్: నివాసాల మధ్య ఎల్లంపేట్ కుంట చెట్ల పొదలతో అడవిని తలపిస్తోంది. కుంటలో మొత్తం చెట్లు పెరగడంతో పాటు వ్యర్థాలు పారవేయడంతో పూర్తిగా కనమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించి, కుంటను సుందరీకరించాలని ప్రజలు కోరుతున్నారు.



చెట్ల పొదలతో ఎల్లంపేట్ కుంట

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కృష్ణానగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: నియోజకవర్గంలోని పది డివిజన్లను అభివృద్ధి పథంలో నిలిపి, ఉప్పల్ సమగ్రాభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీలో రూ.14 లక్షలతో నిర్మించ తలపెట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీరోడ్లు, తాగునీరు, డ్రైనేజీ నిర్మాణం తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఆ దిశగానే కార్యాచరణ చేసి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు డివిజన్ అవసరాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను తన దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తానన్నారు. నిత్యం నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం..

డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ కాలనీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్‌లతో కలిసి ప్రారంభించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదపడతాయని, ప్రతి కాలనీలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి..

మల్లాపూర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాచారం విద్యా భారతి హైస్కూల్‌లోని ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బ్యాడ్జిలను అందజేశారు. గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్, స్కూల్ ప్రిన్సిపాల్ బాల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాడ్జిలను అందజేస్తున్న ఎమ్మెల్యే

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మౌలాలి : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మౌలాలి కార్పొరేటర్ సునీత సూచించారు. డివిజన్ పరిధిలోని క్రియేటివ్‌నగర్, హనుమాన్‌నగర్, మొగల్ కాలనీల్లో రూ. 27 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులైన్లు, సీసీరోడ్లు నిర్మించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపీ ఈటలకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. లోకనాథం, బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్, శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రాజు, కిరణ్, పవన్, నిఖిల్, కాలనీవాసులు లక్ష్మి, ప్రసాద్, రత్న, రాజ్యలక్ష్మి, భాస్కర్, శేఖర్, పవన్‌శర్మ, మనోజ్ పాల్గొన్నారు.

